క్లుప్తంగా

సమష్టికృషితోనే విద్యార్థుల సంఖ్య పెరిగింది



పాన్‌గల్: ఉపాధ్యాయుల సమిష్టి కృషితోనే విద్యార్థుల సంఖ్య పెరిగిందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన ప్రార్థన సమయంలో సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం కంటే ఈ ఏడాది అత్యధికంగా విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించగా వారు చక్కగా సమాధానాలు చెప్పినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు వెంకట్‌నారాయణ, వెంకటేశ్‌యాదవ్, బిందు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

శాకాంబరీగా భవానీమాత



కొత్తకోట రూరల్: పట్టణంలో అంబ భవానీ మాత ఆలయంలో ఆషాడ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు, భక్తులు పలురకాల కూరగాయలతో శాకాంబరీ మాతగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మఠం సాదాశివయ్య, మఠం ఆనందయ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అష్టోత్తరాలు నిర్వహించారు. 41 రకాల పిండివంటలతో పుట్టింటిసారెగా నైవేద్యం సమర్పించారు. పూజలకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం నిర్వాహకులు అనిల్‌కుమార్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు బూట్లు అందజేత



వనపర్తి రూరల్: దేశినేని శ్యామలమ్మ జ్ఞాపకార్థంతో వారి కుమారులు భానుప్రకాష్, విష్ణు విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని అచ్చుతాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గణేష్‌కుమార్ దాతలతో కలిసి బూట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సంధ్య, నాయకులు ఆశన్ననాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటయ్య, చంద్రయ్య, కురుమయ్య బాలీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సాక్షి, నెట్‌వర్క్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ సమ్మేళన కార్యక్రమానికి వనపర్తి జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. హైదరాబాద్ వెళ్తున్న వాహనాలను ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌తో రాష్ట్రంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పీజీ బాబు, ఎన్‌జే బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, విజయ్‌కుమార్, సింగల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఆగారం ప్రకాష్, దేవిజానాయక్, క్యామ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అమరచింత: పట్టణంలోని మహిళా సంఘాలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా రాణించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్పీ, పట్టణ మహిళా సమాఖ్య సంఘాల సభ్యులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్‌లను కలిగి ఉండాలని సూచించారు. రుణాలు పొందిన మహిళలు కుటీర పరిశ్రమలు, చిరు వ్యాపారులు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, మున్సిపాలిటీ మేనేజర్ యూసుఫ్, మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా కొన్ని రోజులుగా ముసురు వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు, వైద్య సిబ్బంది సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీలు, గ్రామాల్లో అధికారులు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డ్రమ్ములు, హౌజుల్లో నిల్వ నీటిని పారబోశారు.

■ వనపర్తి పట్టణంలోని 3, 18, 6, 11, 27, 10, 33, 32, 21, 9, 23, 29, 27 వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది తడి, పొడి చెత్త విభజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. భువన్ సర్వే, ట్రేడ్ లైసెన్స్ రెసిడెన్షియల్ టూ కమర్షియల్ కన్వర్ట్, డ్రైయినేజీల్లోని మురుగు దగ్గరుండి తీయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

■ ఆత్మకూర్ పట్టణంలో మున్సిపల్ కమిషనర్ శశిధర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శశిధర్

■ పాన్‌గల్ మండలంలోని మాందాపూర్, రాయినిపల్లి గ్రామాల్లో పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ మందిర్ వైద్యాధికారి నిహారిక, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, కళమ్మ, పంచాయతీ కార్యదర్శి రూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

■ వనపర్తి మండలంలోని అచ్యుతాపురంలో ఎంపీడీఓ రాఘవ పర్యటిస్తూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీంద్రబాబు, ఈసీ భాస్కర్, టీఏ బాలయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో..



అచ్యుతాపురంలో..



మాందాపూర్‌లో..

ఆత్మవిశ్వాసంతో చదివితేనే ఫలితం

వనపర్తి: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నాగవరంలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలల, మరికుంటలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను, సాయినగర్‌కాలనీలో ఉన్న బాలుర మైనారిటీ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, వల్లభ్‌నగర్‌లోని మైనారిటీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా గురుకులాల్లోని వసతి గృహాల్లో ఉన్న సమస్యల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలని ఆయా పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. గురుకులాల్లోని డార్మెటరీలను పరిశీలించడంతో పాటు విద్యార్థులకు సంఖ్యకు సరిపడ పడకలు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు ఉన్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రయోగాత్మక విధానంతో..

నాగవరంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రయోగాత్మక విధానంతో పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం ద్వారా సులువుగా నేర్చుకోవడమే కాకుండా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఎంచుకున్న రంగాల్లో ఉన్నతంగా రాణించి జూనియర్లకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. హాస్టళ్లలో కొత్త డైట్ ప్లాన్ అమలవుతోందా లేదా అని ఆరా తీశారు. కళాశాలకు చెందిన విద్యార్థులు కళాశాలలోనే మిల్కీ వైట్ మష్రూమ్ పండించడాన్ని పరిశీలించిన కలెక్టర్ వారిని అభినందించారు.



విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

ఉపాధ్యాయుడిగా..

నాగవరంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల (పెద్దమందడి)లో కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు గణిత పాఠ్యాంశాలు బోధించారు. గణితంలో మెలకువలను తెలుసుకోవడం సులువుగా నేర్చుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రానికి సంబంధించి పలు ప్రశ్నలను అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు నోటు పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ ఉమాదేవి, మైనారిటీ శాఖ జిల్లా అధికారి అఫ్జలుద్దీన్, ప్రిన్సిపాళ్లు సరస్వతి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం అంగన్‌వాడీలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలకేంద్రంతో పాటు తూముకుంట, సంగినేనిపల్లి, బొల్లారం, రంగవరం తదితర గ్రామాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు సుగుణాబాయి, మహేశ్వరి, పారిజాత, చంద్రకళ, లక్ష్మి, మాధవి, కృష్ణమ్మ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిస్తాం

సాక్షి, నెట్‌వర్క్: తెలంగాణ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. శుక్రవారం దొడ్డి కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఆయన చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, జాగీర్దార్, జమీందార్ విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరుడు వీరుడు కొమరయ్య అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో పయనిస్తామని ప్రజలకు అండగా నిలిచి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సారంపల్లి మల్లారెడ్డి, శ్రీరామ్‌నాయక్, ఎండీజబ్బార్, మహమూద్, పుట్ట ఆంజనేయులు, మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్, బూరోజు గిరిరాజాచారి, నాయకంటి నరసింహశర్మ, రఘునాథరెడ్డి, శ్రీనివాసులు బాల్‌రెడ్డి, రాజు, బాల్యనాయక్, దేవేందర్, బుచ్చన్న, శ్యాంసుందర్, భారతీయుడు, గయాసుద్దీన్ ఉన్నారు.



ఆత్మకూర్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ

ముఖ్యమంత్రికి లేఖ



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామంలోని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేపపిల్లలకు బదులు నగదు డబ్బులు చెల్లించాలని కోరుతూ లేఖ వ్రాసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం పోస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెండర్ల పద్ధతిలో కాంట్రాక్టర్లు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చేపపిల్లలను పంపిణీ చేస్తుంది. వారు నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేయకుండా నాసిరకంగా అందజేస్తుందన్నారు. దీంతో నగదు పంపిణీ చేయాలని వారు సీఎంకు లేఖ ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం నాయకులు కుర్మయ్య, మహేశ్, నరసింహా, బీసన్న, శేఖర్, స్వామి, శ్రీనివాసులు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి ఉత్తమ అవార్డు



చిన్నంబావి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో 3, 4 తేదీల్లో నిర్వహించిన గద్వాల జోన్ పోలీస్ డ్యూటీ మీట్‌లో క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో చిన్నంబావి ఎస్‌ఐ జగన్మోహన్ రెండో ర్యాంకు సాధించారు. దీంతో ఆయనకు ప్రశంసా పత్రంతో పాటు సిల్వర్ మెడల్‌ను పోలీస్ ఉన్నతాధికారులు బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడానికి సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

నాగవరంలో బైక్ చోరీ

వనపర్తి రూరల్: నాగవరం శివారులోని పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో పాటు డబ్బులు చోరీ చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని నాగవరం శివారులోని టీఎస్ ఆగ్రో పెట్రోల్‌బంక్‌లో పనిచేయడానికి ఓ గుర్తు తెలియని వచ్చాడు. అనంతరం బంక్‌లో పెట్రోల్ పోసే మిషన్ దగ్గర పని చేస్తూ మధ్యాహ్నం వరకు వచ్చిన డబ్బులతో పాటు అందులో పనిచేసే మరో వ్యక్తి బైక్‌ను చోరీ చేశాడు. దీంతో బంక్ మేనేజర్ మధుసూదన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలి

వనపర్తిటౌన్: చెస్ అంటే కేవలం ఆట కాదని, బుద్ధికి పదును పెట్టే ఆయుధమని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6, ఆదివారం అండర్–13 బాల బాలికలకు చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోటీలో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా ఈనెల 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర చెస్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

కొత్తకోట రూరల్: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ పెద్దమందడి మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సంకల్ప సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 18 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, రాధమ్మ, కా వలి తిరుపతయ్య, యాదయ్య, రాంనరేష్, సుక్క మధు, దత్తాత్రేయరెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోక్‌నాథ్‌రెడ్డి

బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

వనపర్తి రూరల్: బాలుడిని పనిలో పెట్టుకున్న షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాన్‌గల్ రోడ్డులోని ఎలక్ట్రికల్ షాపులో బాలుడిని పనిలో పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఆపరేషన్ ముస్కాన్ 11 సంస్థ, లేబర్ ఆఫీసర్ రఫీ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి బాలుడిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. లేబర్ ఆఫీసర్ షాపు యజమానిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రంథాలయాల్లో సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం

మదనాపురం: జిల్లాలోని గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. భవనంపై కప్పుపెచ్చులు పడుతుండడంతో సత్వరమే మరమ్మతులు చేయిస్తామన్నారు. అవసరమైన పుస్తకాలు, పేపర్లు ఎక్కువగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయనవెంట ఉద్యోగి లక్ష్మయ్య పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి వెంకటయ్య

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

● గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్

సాక్షి, నెట్‌వర్క్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న తలపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సీపీఎం, ప్రజాసంఘాలు, టీయూసీఐ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు.

త్వరలోనే ఇంగ్లిష్ టీచర్‌ను నియమిస్తాం

● డీఈఓ అబ్దుల్ ఘనీ

వీపనగండ్ల: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నష్టపోకుండా త్వరలోనే ఇంగ్లిష్ టీచర్‌ను నియమిస్తామని డీఈవో అబ్దుల్‌ఘని అన్నారు. శుక్రవారం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఇటీవల ఇంగ్లిష్ టీచర్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో బోధనకు విద్యార్థులు నష్టపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలకేంద్రం, జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో పాఠశాలకు వచ్చిన డీఈఓ ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని పాఠశాలకు పంపిస్తామని జిల్లా కలెక్టర్‌కు అన్ని విషయాలు తెలియజేసి విద్యార్థులకు నష్టపోకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహులు, జీహెచ్‌ఎం భానుప్రకాష్, హెచ్‌ఎం మంజుల, సీఆర్‌పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్ ఘనీ

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

అమరచింత/ఖిల్లాఘనపురం/వీపనగండ్ల: భూమి పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏడీఏ దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక క్లస్టర్‌లో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలయ్యే పథకాలు, పీఎం కిసాన్ డబ్బులు పడడానికి ఫార్మారిజిస్ట్రీ అనేది కీలక ఆధారమన్నారు. కార్యక్రమంలో ఏఓ అరవింద్, ఏఈఓలు పాల్గొన్నారు.

■ ఖిల్లాఘనపురంమండలంలోని ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశిష్ట రైతు గుర్తింపు కార్డుల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 16 వేల మంది రైతులకు గాను ఇప్పటి వరకు 6,800 మంది రైతులు మాత్రమే ఈ కార్డుల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు

■ వీపనగండ్ల మండలంలోని రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ శిబిరాలను వినియోగించుకోవాలని ఏడీఏ డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బొల్లారంలో రైతుల పేర్ల నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల రైతువేదికలో శిబిరాలను ఏర్పాటు చేసి విస్తరణ అధికారుల ద్వారా రైతుల పేర్లను నమోదును చేస్తున్నామన్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల జరిగే నష్టాలకు పరిహారాన్ని పొందేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు అభిలాష్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ దామోదర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖిల్లాఘనపురం: ఎమ్మెల్యే ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను వంచించిన కాంగ్రెస్‌కు బుద్ధి వచ్చేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మామిడిమాడ, పర్వతాపురం తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలను చైతన్యం చేసేందుకు గాను ముందస్తు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనువాసులుగౌడు, భాస్కరాచారి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

నూతన కార్యవర్గం ఏర్పాటు

వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామ మహిళా సంఘానికి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షురాలిగా వల్లమ్మ, కార్యదర్శిగా కృష్ణవేణి, కోశాధికారిగా శ్రీలతను ఎన్నుకున్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

ఖిల్లాఘనపురం: మండలంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటి ఆచూకీ గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ జయన్న తెలిపారు. అనంతరం వాటిని శుక్రవారం బాధితులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్యనారాయణగౌడ్ ఉన్నారు.

ముగిసిన నవరాత్రులు

వనపర్తి రూరల్: వారాహి గుప్తా నవరాత్రుల సందర్భంగా శుక్రవారం పెబ్బేరు పట్టణంలోని లలితా త్రిపుర సుందరీదేవి ఆలయంలో అమ్మవారికి పంచవస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చివరి రోజు శ్వేతా వారాహి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గోవర్ధనాచారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి వడ్డె ఈశ్వర్, ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి, నాయకులు కర్రెస్వామి, వడ్డె ఈశ్వర్, సితార వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.